విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 19 జనవరి 2025 8 పేజీలు

ప్లాస్టిక్ నిరోధం ప్రతి ఒక్కరి బాధ్యత

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: స్వచ్ఛ పశ్చిమగోదావరి జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్లాస్టిక్ నిరోధం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమం మొదటిగా భీమవరం ఆదర్శనగర్ పార్కులో కలెక్టర్ చదలవాడ స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పార్కులో స్వయంగా చెత్తను తొలగించి శుభ్రపరిచారు. స్థానిక ప్రజలతో పరిశుభ్రతపై, ప్లాస్టిక్‌ను నిరోధించడంపై పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మన గృహం, మన పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యంగా ఉండగలమని, మన గృహాన్ని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచినప్పుడే సమాజ ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. పెళ్లిళ్లు, తదితర కార్యక్రమాలకు పెద్ద ఎత్తున డిస్పోజబుల్ వస్తువులను వినియోగిస్తున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా అరటి ఆకులు, చేతితో కుట్టిన ఇస్తర్లు, తదితర పర్యావరణానికి ముప్పు వాటిల్లని వస్తువులను ▶మిగతా 2లో..

ఏఐవైఎఫ్ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అమలాపురం : ఎన్నికల హామీల్లో భాగంగా సచివాలయ వలంటీర్లు కొనసాగింపు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు డిమాండ్ చేశారు. స్థానిక రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఉగ్గిరాల సురేష్ అధ్యక్షతన జిల్లా ఏఐవైఎఫ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సత్తిబాబు మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీల్లో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా మహాసభలు అమలాపురంలో నిర్వహించనున్నారని, మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. యువత ▶మిగతా 2లో..

మెరుగైన జీవనానికి స్వచ్ఛత అవసరం

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-నూజివీడు : మెరుగైన ప్రజాజీవనానికి అందరిలో స్వచ్ఛత పై పూర్తి అవగాహన కల్పించడంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలో కలెక్టర్ వెట్రిసెల్వి పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. తొలుత రాజీవ్ సర్కిల్‌లో చెత్త

తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం రోడ్డు రివైడర్ పై మొక్కలు పెంచడంపై మున్సిపల్ అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పట్టణంలో పలు రహదారులను సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు ఆయా ప్రాంతాల్లో చేపట్టవలసిన పారిశుధ్య అంశాలపై ఆదేశాలు ఇచ్చారు. రాజీవ్ సర్కిల్ సమీపంలో రోడ్డుపై కొబ్బరిబొండాలు అమ్ముతూ ప్రక్కనే వినియోగించిన బొండాలను పారేసివుండటం గుర్తించి సంబంధిత వ్యక్తితో మాట్లాడి వాటిని రోజూ ▶మిగతా 2లో..

అమిత్‌షాను అరెస్టు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: రాజ్యాంగం ఏర్పడి డెభై ఐదేళ్లు అయిన సందర్భంగా రాజ్యసభలో జరిగిన చర్చలో అంబేద్కర్‌ను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను అరెస్టు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను, అమిత్ షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ ఆదివారం భీమవరంలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సుందరయ్య భవనంలో శనివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ ఆదివారం జరిగే అమిత్ షా గో బ్యాక్ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రజలు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ మాట్లాడతూ ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను పరిశీలించి భారత రాజ్యాంగాన్ని లిఖించిన అంబేద్కర్‌లాంటి మేధావిని కేంద్ర హొంమంత్రి బాధ్యతల్లో వున్న అమిత్‌షా పార్లమెంట్ సాక్షిగా కించపరచడం దేశద్రోహమని అన్నారు. అమిత్ షా కు రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హతలేనని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంకా కృష్ణ మూర్తి మాట్లాడుతూ అంబేద్కర్‌ని అవమానించి వారి అసలు రూపాన్ని బయటపెట్టుకున్నారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్నే మార్చేయాలని చూసే వీరు అంబేద్కర్‌పై విషం జల్లుతున్నారన్నారని ఎంసిపిఐయు నాయకులు కె.మంహకాళి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరైన అంబేద్కడర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు.

పరిశుభ్రమైన వాతావరణంతోనే ఆరోగ్యం

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కరప : పరిశుభ్రమైన వాతావరణంతోనే ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కరప మండలం కడప గ్రామంలోని మార్కెట్ సెంటర్ వద్ద నుంచి మెరక వీధి మీదుగా నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీలలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పంచాయతీ అధికారి వి. రవి కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కరప ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మో హన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం భవిష్యత్ తరాలకు అందించవచ్చన్నారు. స్వచ్ఛ కార్యక్రమంలో జిల్లాలో అన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయ ప్రాంతాల్లో చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు తొలిగించడం, మురికి కాలువలు శుభ్రం చేయడం, బస్టాండ్లు, మార్కెట్ సెంటర్లు ఇతర ప్రధాన కూడళ్లను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కడప ఎంపీపీ పీ శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీడీవో ఎం.అనుపమ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ మనందరిది

కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా 12 నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ పి. ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక బొమ్మూరు రూరల్ రాజీవ్ కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పి. ప్రశాంతి, రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిసరాల పరిశుభ్రత, మనం నివసించే, తిరిగే ప్రాంతాలలో శానిటేషన్ కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రపరచడం, శిథిలాల తొలగింపు, బహిరంగ ప్రదేశాలు, బస్టాప్‌లు, మొదలైన వాటిలో మూసుకుపోయిన కాలువలను డ్రైన్‌లలో పూడిక తీత పనులు చేపట్టడం ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టడం ▶మిగతా 2లో..

ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను సాకారం చేస్తాం

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలోని గ్రామీణ స్థాయిలోని ప్రతి పేదవాడికి మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని ఉచితంగా అందించి వారి సొంత ఇంటి

కలను సాకారం చేయడానికి చర్యలు చేపట్టినట్లు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు, అధికారులు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి వివరించగా సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-లింగపాలెం: బోగోలు ఐ.సి.ఎం.ఉన్నత పాఠశాలలో 2004-2005లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దూర ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ

విద్యార్థులు హాజరై తాము చదివిన పాఠశాలలోని జ్ఞాపకాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా వీరికి ఆనాడు చదువు నేర్పిన విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కమలాబాయి మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు ఇలా కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం ఎంతో ఆనంద దాయకంగా ఉందని అన్నారు. ఆర్థికంగా స్థిరపడిన వారు ఇబ్బందుల్లో ఉన్న మిత్రులకు సహాయ సహకారాలు అందించాలని ఈమె కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయులు సువర్ణరాజు,ఝాన్సీ లక్ష్మీబాయి,ప్రసాద్‌లతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ రావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమాలలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సింగగూడెం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్

సజీమ్ పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈయన స్వయంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పంచాయితీ కార్యదర్శి,సిబ్బంది పాల్గొన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు రామారావు, రవీంద్ర, సీఆర్పీలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగపాలెం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరు స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలి

రాష్ట్ర మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర-నూజివీడు: పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శనివారం నూజివీడు మండలం తుక్కులూరులో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుక్కులూరు కూడలిలో మానవహారంగా ఏర్పడి అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞను రాష్ట్ర మంత్రి పార్థసారథి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత శుభ్రత ప్రజల జీవన విధానం కావాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ప్రతినెల 3వ శనివారం క్రమం తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అందరి సహకారం, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. గతంలో గ్రామాల్లో చాలా పరిశుభ్రమైన గాలి, వాతావరణం ఉండేవని, క్రమేపి జనాభా పెరుగుదల కారణంగా చెత్త పెరిగి ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగిస్తున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలనే మంచి ఆలోచన అందరిలో ప్రేరేపితం కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొమ్మండ్రు బుజ్జి, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, డిఎల్ పిఓ ఎంపిఎల్ సుందరి, డిఎల్ డిఓ వెంకట్రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మనందరిది

(1వపేజీ తరువాయి)

జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి జిల్లా గ్రామ పంచాయితీ అధికారి ఎమ్. నాగలత, ఎంపిడిఓ డి. శ్రీనివాస్ రావు, ధవళేశ్వరం సీ ఐ గణేష్, ఈ వో పీఆర్డి ఆర్మ్ స్ట్రాంగ్, ఇతర అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శి, వి ఆర్వో, సచివాలయ సిబ్బంది, రాజీవ్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

(1వపేజీ తరువాయి)

శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. భారతీయ యువత జాతీయ అంతర్జాతీయ అంశాల పైన దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఇజ్రాయిల్, పాలస్తీనా(గాజా) కాల్పుల విరమణ ఒప్పందం శవాల గుట్టపై శాంతి ఒప్పందంగా ఉందని సత్తిబాబు పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులతో చేసిన ఒప్పందం ప్రకారం రైతు ఉత్పత్తులకు లాభసాటి ధర అమలు చేస్తామని రైతు సంఘాల జేఏసీతో చేసిన ఒప్పందం మేరకు అమలు చేయాలని డిమాండ్లతో ఖనౌరి సరిహద్దులో 52 రోజులుగా నిరాహారదీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా నిమ్మకాయ శ్రీనివాసరావు, కాళ్ల భీమరాజు ప్రధాన కార్యదర్శిగా, వి. ఆనంద్ కోశాధికారిగా మరో 15 మందితో కమిటీ ఏర్పాటు చేశారు.

స్వచ్ఛత అవసరం

(1వపేజీ తరువాయి)

ఎక్కడ వేస్తారని ప్రశ్నించారు. దానిపై అతను సమాధానం ఇస్తూ సమీపంలోని మున్సిపల్ యార్డ్‌లో పడవేస్తామని తెలిపారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్తతీసుకోవాలని ఇష్టానుసారం ప్లాస్టిక్, కొబ్బరి బొండాలు తదితరాలను రోడ్లపై వేస్తే సంబంధిత వ్యక్తులపై జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనరుకు కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త ఎక్కువగా ఎక్కడ పేరుకుపోయిందో ఆ ప్రాంతాలను గుర్తించి అవసరమైన పారిశుధ్యకార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నూజివీడు పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈవిషయంలో స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛందసంస్థలు, తదితరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మున్సిపల్ కమిషనరుకు కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛ నూజివీడు పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందన్నారు.కలెక్టర్ వెంట నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, మున్సిపల్ కమిషనరు రెడ్డి, తహశీల్దారు సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి బాధ్యత

(1వపేజీ తరువాయి)

వినియోగించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. భీమవరం పట్టణం ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచిందని, ఇటువంటి పట్టణాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆరోగ్య వంతంగా ఉంచేందుకు మీ వంతు బాధ్యతను నెరవేర్చాలన్నారు. అనంతరం స్థానిక ప్రజలు, నాయకులు, ప్రభుత్వ శాఖల సిబ్బంది అందరితో ఎమ్మెల్యే స్వచ్ఛతపై ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు కొప్పినీడి బాబి, రామ సత్యనారాయణ, స్థానిక పెద్దలు బి. వెంకటేశ్వరరావు, సిహెచ్ వెంకట రామరాజు, ఎం.కృష్ణంరాజు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Somala Karunakumari, W/o Somala Suvarna Raju, resident address 2-40, Kothapeta, SC Colony, Chilukuru, Undi Mandal, WG Dist, AP-534199, have changed my name from **Sodadasi Karuna Kumari (old name) to Somala Karunakumari (new name).** Henceforth, all my documents and correspondence will continue with my new name, **Somala Karunakumari.**

చిత్తశుద్ధితో స్వచ్ఛత కార్యక్రమాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర-దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛంద కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, కేవలం ప్రచారాల కోసం మాత్రమే కాకుండా చిత్తశు

ద్ధితో పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛత ఆవశ్యకతను ఇతరులకు తెలియజేస్తూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని దెందులూరు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో నిర్వహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు గ్రామంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్థానిక కూటమి నాయకులు అధికారు లతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు, సిబ్బంది,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరంగూడెంలో స్వచ్ఛ దివాస్

విశాలాంధ్ర-లింగపాలెం: మరంగూడెంలో సర్పంచ్ పొదిలి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి

రత్నకుమార్, బిజెపి నాయకులు చక్రధర్ రావు,తెలుగుదేశం పార్టీ నాయకులు ఘంటా రాజేంద్ర, జాస్తి శ్రీను తదితర నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై వీరంతా ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే సొంగా నివాళి

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని శనివారం చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ జంగారెడ్డి గూడెం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చేసిన సేవల గురించి మాట్లాడుతూ మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు భాషకు,

తెలుగు వారికి ఓ గుర్తింపు తీసుకొచ్చిన మహానాయకుడు అన్నారు. నటుడిగా ప్రస్థానం మొదలుపెట్టి టాప్ హీరోగా తెలుగు సినీ పరిశ్రమను ఏలి అనంతరం ప్రజలకోసం రాజకీయాల్లోకి వచ్చి వారి సమస్యలు తెలుసుకొని సీఎంగా ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించి ఎంతో మందికి దైవంలా నిలిచారని కొనియాడారు రోజుకి 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆయన అన్నారు.ఎన్.టి ఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, కార్యదర్శి తూటిగుంట రాము, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, నంబూరి రామచంద్రరాజు , పండు, దాసరి శేషు, షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా నవోదయ పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహించే నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిం చాలని గణపవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆర్. జేబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం గణపవరం ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల

హై స్కూల్ లో నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఆమె తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పరీక్ష వ్రాసేవారికి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఈ తనిఖీల్లో గణపవరం ఎంఈఓ గొర్రెల బాలయ్య పాల్గొని మాట్లాడుతూ మొత్తం మండలంలో 238 మంది విద్యార్థులు వ్రాయవలసి ఉండగా 90 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కోసం
విద్యార్థుల మానవహారం

విశాలాంధ్ర – ఏలూరు : పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజు కొంత సమయం కేటాయించి తద్వారా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు కట్టుబడి ఉన్నామని వారంతా ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు శనివారం స్థానిక పాత బస్టాండ్‌లో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వెట్రి సెల్వి నేతృత్వంలో ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు,ఉద్యోగులు,పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. పరిశుభ్రత పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు ప్రతిన పూనారు. నగర కమిషనర్ ఎ. భాను ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, డీఈవో వెంకట లక్ష్మమ్మ, జెడ్‌పి సిఈఓ సుబ్బారావు, డిఎస్‌డిఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర – తాడేపల్లిగూడెం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జనవరి నెలలో మూడో శనివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ. స్వరాజ్యలక్ష్మి , సిబ్బంది కలసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లోపల పరిసరాలను శుభ్రపరచుకుని స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజలకు చేరవేసి మనం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ధర్మరాజు ప్రతిజ్ఞ చేశారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గడ్డి తొలగింపునకు కత్తి పట్టారు. ఎంపీడీవో ఆర్‌జి మనోజ్ చెత్తని పట్టుకొని చెత్త రిక్షాలో వేసారు . ఇది చూసిన ఆ ఇద్దరి పట్టుదల,కృషికి బాసటగా నిలిచారు. ఇంకేముంది? స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.ఈ స్ఫూర్తిదాయక సన్నివేశం ఉంగుటూరు మండలం బాదంపూడిలో శనివారం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే శ్రమదానం చేసి, గ్రామస్తులకి తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, కార్యదర్శి కె.వి గిరిధర్, సర్పంచి కంకట పద్మ లీల వెంకట్రావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బొడ్డు వెంకట రవి చంద్రకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ బందారు సింధు మధుబాబు, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడులో ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర -నూజివీడు: తెలుగుదనానికి ప్రతిరూపం ఎన్టీఆర్ అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. శనివారం నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి పార్థసారధి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి రక్తదానంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, పార్టీ నాయకులను మంత్రి పార్థసారథి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదనీ ప్రభంజనం అన్నారు. తెలుగువాడి విశ్వరూపం ఎన్టీఆర్ అని కొనియాడారు. అనంతరం మంత్రి తుక్కులూరు గ్రామంలో నిర్మించిన జెబిఎల్ వృద్ధుల శరణాలయంలో నూతన వస్త్రాలను 80 మంది వృద్ధులకు మంత్రి పార్థసారధి పంపిణీ చేశారు.

రావిచర్లలో : మండలంలోని రావిచెర్ల గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామం లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి తెలుగుదేశం నాయకులు నివాళులర్పించారు.

ముద్రబోయిన కార్యాలయంలో : నూజివీడులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్రబోయిన వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మీ విచారణ వద్దు...

నడిపల్లి గ్రామస్తుల నిరసన

విశాలాంధ్ర-పెదవేగి: నడిపల్లి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి పి. చంద్రశేఖర్ విచారణకు వెళ్లగా గ్రామస్తుల నుండి నిరసన సెగ తగిలింది. మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పై గ్రామస్తులు, జిల్లా అధికారులకు పీ జీ ఆర్ ఎస్ లో చేసిన ఫిర్యాదుల పై శనివారం నడిపల్లి గ్రామానికి వెళ్లిన విచారణాధికారికి గ్రామస్తులు నిరసన తెలిపారు. నడి పల్లి గ్రామ పంచాయతీ లో నిధులు దుర్వినియోగమయ్యాయని గ్రామస్తులు చేసిన ఫిర్యాదుల పై విచారణ చేపట్టడానికి ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి కె పీ చంద్ర శేఖర్ శనివారం నడిపల్లి గ్రామ సచివాలయా నికి చేరుకున్నారు. ఆయన రాకను తెలుసుకున్న గ్రామస్తులు నడి పల్లి లో విచారణ నిమిత్తం వచ్చిన విచారణాధి కారి గో బ్యాక్, గో బ్యాక్ ,అంటూ ప్ల కార్డులతో ,ప్లెక్సీ లతో నినాదాలు చేశారు.గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వ పరిపాలనలో జగనన్న కాలనీలకు తమ్మిలేరు నుండి ఉచిత ఇసుక పంపిణీ ముసుగులో ఇతర అవసరాలకు తరలిపోయిందని, ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల నుండి సీనరేజ్ పేరుతో రూ.30 లక్షలు వసూలు చేసి వాటిని పంచాయతీకి జమ చేయ లేదని,పంచాయతీలో జరిగిన మరి కొన్ని అక్రమాలపై జుజ్జువరపు సురేష్, పెనమ నూరి సురేష్, మద్దాల గోపాలరావు తదితరులు పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు అనేక మార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన అప్పటి డీ పీ వో నడిపల్లి పంచాయతీ పై వచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయి లో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని అప్పటి డీ ఎల్ పి వో,ప్రస్తుత డీ ఎల్ పి వో కె పీ చంద్ర శేఖర్ ని ఆదేశించారు. డీ ఎల్ పి వో చంద్ర శేఖర్ గతంలో విచారణ పేరుతో నడి పల్లి వచ్చి ఫిర్యాదు దారులకు సమా చారం ఇవ్వ కుండా పంచాయతీ యాజమాన్యంతో నాలుగు గోడల మధ్య విచారణ జరిపి ఆ విచారణ లో ఫిర్యాదు దారుడు జుజ్జ వరపు సురేష్ హాజరు కాక పోయినా హాజరైనట్టుగా విచారణ నివేదికలో చేర్చారని, సురేష్ లేకుండా ఒక ఫొటో తీసి ఆ ఫొటోలో ఉన్నట్టుగా చూపి అప్పటి విచారణ నివేదికను అధికారు లకు అందజేసినట్లు అప్పట్లో ఆరోపించారు. ఫిర్యాదు దారులు ఆ నివేదికపై వెంటనే స్పందించి విచారణాధి కారి విచారణ సమయంలో వేరే వాళ్లు ఉండగా విచారణ చేస్తున్నట్టు ఒక ఫొటో తీయించుకుని ఆ ఫొటోలో తాను లేక పోయినా ఉన్నట్టు ,తానే విచారణాధికారి ముందు స్టేట్ మెంట్ ఇచ్చినట్టు తప్పుడు నివేదిక తయారు చేసిన విచారణాధికారినే జిల్లా అధికారులు మళ్ళీ నడి పల్లి లో మరో సారి విచారణ జరపాలని పంపడం హాస్యాస్పద మని ఫిర్యాదు దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మరో సారి నడిపల్లి పంచాయతీ కి విచారణకు రావడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ అధికారి విచారణ పై తమకు నమ్మకం లేదని నడి పల్లి లో నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే జిల్లా జాయింట్ కలెక్టర్‌తో లేదా జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే బడేటి చంటి

విశాలాంధ్ర-ఏలూరు: నిరంతరం పేదల అభ్యున్నతికి కృషి చేసిన కీ.శే. నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పేర్కొన్నారు. తేదేపా వ్యవస్థాప కులు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మూడవ డివిజన్‌లో టిడిపి ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో పేదవారు అభివృద్ధి చెందాలన్న కాంక్షతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అన్ని దానాలలో రక్తదానం ఉత్తమమైనదన్నారు. ఈ చిన్న సహాయం మరొకరి ప్రాణాలు కాపాడుతుందన్నారు.తేదేపా ఎస్.సి.రాష్ట్ర ఉపాధ్యక్షులు, మూడవ డివిజన్ ఇంచార్జ్ జాలా బాలాజీ మాట్లాడుతూ ఎన్టీఆర్ సంక్షేమ పథకాల ఆరాధ్యుడన్నారు.పేదవాడికి పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో కిలో 2 రూపాయల బియ్యం పథకాన్ని నిరాటంకంగా అమలు చేశారని కొనియాడారు. స్థానిక శాసనసభ్యులు బడేటి చంటి ఆధ్వర్యంలో నగరం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు.జాలా శివశంకర్,వీర బత్తిన రత్తయ్య, షేక్ మస్తాన్ రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు,పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణ టిడిపి అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేష్ట రామకృష్ణారావు మాట్లాడుతూ మహా మనిషి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్, జనసేన పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, బలుసు నాగేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, మండల మహిళా అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లింగపాలెం: మండల కేంద్రమైన లింగపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షులు గరిమెళ్ళ చలపతి, మోరంపూడి మల్లికార్జునరావు, చెరువుగట్టు రామ్మోహన్ రావు, మోరంపూడి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు గ్రామంలో కూటమి పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు వర్ధంతి జరిగింది. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బందారు సింధు మధుబాబు, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి సూర్య చంద్రరావు, మండల టిడిపి అధ్యక్షులు పాతూరి విజయ్ కుమార్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలో నారాయణపురం, కాగుపాడు, కైకరం, చేబ్రోలు తదితర గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు జరిగాయి.

సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దే : ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: 'సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో తెలుగు దేశం పార్టీని స్థాపించి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున పథకాలు అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, దివంగత నంద మూరి తారక రామారావుకే దక్కు తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి ఎంపీ మహేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలల కాలంలోనే ఎన్టీఆర్ అధికార పగ్గాలు చేపట్టి చరిత్ర సృష్టించారని కొనియాడారు. కూడు,గూడు, గుడ్డ అనే నినాదంతో పేదల అభ్యున్నతికి ఎన్టీఆర్ పాటుపడ్డారని ఎంపీ తెలిపారు.

ఏలూరు ఫొటో - 23 :

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం అని పరింపుడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయకుమారి పేర్కొన్నారు. పరింపూడి గ్రామంలో సచివాలయం -2 వద్ద స్వచ్- ఆంధ్ర,స్వచ్ఛ- దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కూటమి పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది, కలసి పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాల చుట్టూ, ఇళ్ల చుట్టూ, ఉన్న పరిసరాలను పరిశుభ్రపరచినప్పుడే ఆరోగ్యాలు కూడా మెరుగుగా ఉంటాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షులు మాదేపల్లి శ్రీనివాస్, టిడిపి నాయకులు బలుసు నాగేశ్వరరావు, ముప్పిడి చినబాబు, నక్క బాబి, మట్ట శ్రీనివాసరావు, సంకు మధు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి.నరసాపురం : మైనర్ బాలిక అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టి నరసాపురం గ్రామానికి చెందిన సత్యవరపు బాలకృష్ణ పెద్ద కుమార్తె పూజిత వెంకట లక్ష్మీ (14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. పూజిత అదే గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద యూరిన్‌కి బాత్ రూమ్ లోకి వెళ్లి పడిపోవడంతో పూజిత చిన్నమ్మ ఫోన్ చేసింది. స్పృహ తప్పి పడివున్న పూజితను తల్లిదండ్రులు చింతలపూడి విన్ కా హెల్త్ కేర్ ఆస్పత్రికి తీసుకు వెళ్ళి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం చింతల పూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి బాల కృష్ణ ఫిర్యాదుతో ఎఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుష్టు వ్యాధి నివారణ చర్యలు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: జిల్లాలో కుష్టువ్యాధి పట్ల అవగాహన కల్పించి వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టనున్నామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. భాను నాయక్ అన్నారు, శనివారం జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలన బ్రోచర్ను ఆవిష్కరించి మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ప్రతి గ్రామాలలో సర్వే నిర్వహించి అనుమానితు లను గుర్తించి స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలకు పంపించి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా నివారణ మందులు ఇవ్వనున్నట్టు చెప్పారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఏమైనా ఉంటే ముందుగానే గుర్తించి ప్రథమ చికిత్స చేయించుకోవాలని అని తెలిపారు, ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి గజపతిరావు, ఎస్సీ సంక్షేమ అధికారి రామానుజ రాజు, పుష్పరాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణలో చిరు వ్యాపారులే తొలి వైద్యులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : చిరు వ్యాపారులు లాభసాటి వ్యాపారంతో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత, కల్తీ లేని ఆహారంపై చిరు వ్యాపారులతో (బండ్లపై ఆహార పదార్థాలు అమ్మేవారు) ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ చదల వాడ నాగరాణి, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ శుచి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు చిరు వ్యాపారులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం 12 నెలల పాటు ప్రతినెల మూడో శనివారం పరిసరాలు పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, కల్తీ లేని ఆహార పదా ర్థాలు తదితర అంశాలపై కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. ఎక్కువ కాలం జీవించాలన్న, ఆరోగ్యవంతంగా ఉండాలన్న నాణ్యమైన ఆహారాన్ని స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కలుషిత ఆహారం వలన పిల్లలు, పెద్దలకు జీర్ణాశయ సమస్యలు, అవయవాలపై దుష్ప్రభావం, అవయవాల నిర్మాణంలో లోపం, పిల్లల ఎదుగుదల లోపం సృష్టిస్తున్నాయని దీనిని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. అనుమతించిన ఫుడ్ కలర్స్ మాత్రమే వినియోగించాలని, ప్లాస్టిక్‌ను నిరోధించాలని, టీ హోటల్స్‌లో గాజు

గ్లాసులను మాత్రమే వినియోగించాలని సూచించారు. హోటల్స్, బళ్ళు పై విక్రయించే ఆహార పదార్థాల తనిఖీకి ఆర్డిఓ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం కారణంగా కిడ్నీ, క్యాన్సర్ వంటి రోగాల బారిన పడి ఎన్నో కుటుంబాలు ఇబ్బందులను పడుతున్నా యన్నారు. టేస్టింగ్ సాల్ట్ నాలుగు సంవత్సరాలుగా తీసుకున్న ఒక వ్యక్తికి కిడ్నీ పోయిందని ఈ సందర్భంగా తెలియజేస్తూ టేస్టింగ్ సాల్ట్ ఎట్టి పరిస్థితుల్లో హోటల్స్, చిరు వ్యాపారులు ఆహార పదార్థాలను కలపవద్దని విన్నవించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డిఓ ఖతీబ్ కౌసర్ భానో, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రఘు, తహసిల్దారులు సునీల్ కుమార్, వై.శ్రీనివాస్, చిరు వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్లౌజులు లేకుండానే స్వచ్ఛభారత్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్వచ్ఛ- ఆంధ్ర, స్వచ్ఛ- దివస్ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెల మూడవ శనివారం నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో, మండలంలో వివిధ గ్రామాలలో పంచాయతీల ద్వారా శనివారం పరిసరాల పరిశుభ్రత నిర్వహించారు. దీనిలో భాగంగా కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ చల్లన్న దొర హాజరయ్యారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న అధికారు లకు కానీ, వివిధ పార్టీల నాయకులకు కానీ, పంచాయతీల సిబ్బందికి కానీ, శానిటేషన్ కు సంబంధించి చేతి గ్లౌజులు, పారిశుధ్య కార్మికులు ధరించే జాకెట్స్, మాస్కులు లేకపోవడం చర్చనీయాంశ మైంది. ప్రతిరోజు పంచాయతీ సిబ్బంది ఉత్తి చేతులతోనే వ్యర్థ పదార్థాలను ట్రాక్టర్లపై వేస్తుంటారు. కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టినప్పుడు కూడా ఉన్నత అధికారులు, నాయకులు , పారిశు ధ్య సిబ్బంది, గ్లౌజులు ధరించకపోవడం పలువురు చర్చించుకున్నారు.

స్వచ్ఛాంధ్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చింతలపూడి నియోజక వర్గంలో విజయవంతంగా నిర్వహించా లని స్థానిక శాసనసభ్యులు సొంతంగా రోషన్ కుమార్ అధికారులకు ప్రజా ప్రతినిధు లకు సూచించారు.రాష్ట్రంలో ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు .దీనిలో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో శని వారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రారంభించి చీపురుతో చెత్త తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ,ఇతర అధికారు లతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట : ఎస్పీ కిషోర్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఏలూరు జిల్లాలోని పోలీస్ శాఖలో, అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తానని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ సిబ్బందికి ఒక నెల వేతనం బోనస్ గాను, యూనిఫామ్‌ను ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో గల ఎస్పీ చాంబర్‌లో పెట్రోల్ బంక్ సిబ్బందికి ఎస్పీ కిషోర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంకులో పనిచేస్తున్న ఉద్యోగులు మాట్లా డుతూ జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బోనస్, యూనిఫామ్ ను స్వీకరించడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. గతంలో ఎప్పుడూ జిల్లా ఉన్నతాధికారులను కలవడం జరగలేదని, ఎస్పీ స్వయంగా నగదును, యూనిఫామ్ అందజేసి విధి నిర్వహణలో ఎదురవుతున్న కష్ట నష్టాలను తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఏఆర్ ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర - కామవరపుకోట : దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి శనివారం కామవరపుకోటలో నిర్వహించారు. కొత్తూరు ట్రావెలర్స్ బంగ్లా ఎదురుగా గల ఎన్టీఆర్ విగ్రహానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు, తెలుగు జాతికి ఔన్నత్యాన్ని తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎన్టీఆర్ ఆశయ సిద్ధాంతాలకనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలి అన్నారు. అనంతరం వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, గంటా సుధీర్ బాబు, సత్యంబాబు, మాధవరావు కంటమనేని సత్యనారాయణ, సర్పంచులు పసుమర్తి పార్థసారథి, గూడపాటి కేశవరావు, గోరీక దాసు, వేముల శ్రీనివాసరావులు, మండల బిజెపి అధ్యక్షులు బాలవర్తిని రాజు, మున్నంగి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమణారావు మృతికి ఏఐటీయూసీ సంతాపం

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు టౌన్ టొబాకో మర్చంట్ అసోసియేషన్ నాయకులు తిరిండి రమణారావు మృతికి ఏఐటీయూసీ, ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం నాయకులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శనివారం తిరిండి రమణారావు మృతదేహాన్ని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర్‌రావు, కడుపు కన్నయ్య, ఎస్ సంజీవరావు ఏలూరు పొగాకు పని వారల సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, అధ్యక్షులు బరగడ పోతురాజు, కార్యదర్శి పుప్పాల శ్రీనివాసరావు, కోశాధికారి చింతపల్లి కుర్మా రావు సందర్శించి మృతదేహం పై పుష్పమాల నుంచి నివాళులర్పించారు. రమణారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నవోదయ పరీక్షకు 185 మంది హాజరు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జవహర్ నవోదయ పరీక్ష ఉదయం 11:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 258 మంది విద్యార్థులకుగాను,73 మంది గైర్హాజరయ్యారు. 185 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు మండల విద్యాశాఖ అధికారి జే.సురేష్ బాబు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత మనబాధ్యత

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చుని, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మండల అధ్యక్షులు పోతుల మోహన్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. గండేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అన్ని శాఖల సిబ్బంది, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రొత్త సంవత్సరం-పరిశుభ్రతకు నాంది అనే అంశంతో పరిశుభ్రతా కార్యక్రమాలు, మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్చార్జి బొల్లం రెడ్డి రామకృష్ణ చౌదరి, సుంకవిల్లి రమేష్, యలమాటి కాశి, తహసీల్దార్ ఆర్ శ్రీనివాస్, పైలా వెంకన్న, ఏవో చందర్రావు, ఏపీఎం సన్యాసిరావు, ఏపీఓ ఆర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టీయూకేలో ....

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్' కార్యక్రమాన్ని జెఎన్‌టియుకె ప్రాంగణంలోశనివారం ఉదయం యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్, సిఎస్‌ఈ, ఈసిఈ, గ్రంథాలయ విభాగాలలో నిర్వహించారు. యుసిఇకె ఇంజనీరింగ్ విభాగాలలో చేపట్టిన పరిశుభ్రతా కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు మాట్లాడుతూ తొలుత చెత్తా చెదారాలను గుర్తించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని, డ్రైనేజీలలో పూడికతీత చేపట్టడంతో పాటు లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. నెల నెలా ఒక ఇతివృత్తంతో సంవత్సరం పొడవునా 12 ఇతివృత్తాలతో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు, బోధనేతర సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు మండలంలో..

విశాలాంధ్ర - చాగల్లు : మండల కేంద్రంలో మెయిన్ బజార్ నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం నాడు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ర్యాలీ చేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముప్పిడి శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొంత సమయం కేటాయించి మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను స్వచ్ఛత చేసుకుంటే ఎంతో పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు.మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండల కేంద్రమైన జగ్గంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి వత్సవాయి రాజంరాజు ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద, మెయిన్ రోడ్‌లోనూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పారిశుధ్య, అంగన్వాడీ, ఆశా వర్కర్స్‌తో వీధులను శుభ్రపరిచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుతగా పంచాయతీ కార్యదర్శి స్వచ్ఛ్ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ నిర్వహించడానికి తమ వంతు సహకారం అందించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, సీఐ వైఆర్‌కే శ్రీని వాస్, ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఓ ఎమ్ పూర్ణిమ, ఎండిఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జెవిఅర్ రమేష్, డ్వాక్రా యానిమేటర్లు, పారిశుధ్య సిబ్బంది, పాల్గొన్నారు.

స్వచ్ఛ కాకినాడలో అందరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో నగరప్రజలందరూ భాగస్వాములు కావాలని, మన కాకినాడను పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ అన్నారు. శనివారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరై మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే నగరవాసులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుకుగా మార్కెట్‌కు సంప్రదాయ క్లాత్ సంచులు తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీగా కొండయ్యపాలెం ఫ్లైఓవర్ సెంటర్ సమీపానికి వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట రహదారిని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఈ కామేశ్వరరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్‌ఓ శిరీష్ ఇలా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని సచివాలయాల పరిధిలో : మరోవైపు నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలోనూ ఉదయం ఏడు గంటలకు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా వీధులు, డ్రెయిన్లు, టాయిలెట్లను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయి. వార్డు సచివాలయాల సెక్రటరీలు, ఎమినిటీస్, వెల్ఫేర్ సెక్రటరీలు, ఇలా సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రా -స్వచ్ఛ దివాస్

విశాలాంధ్ర - ఆత్రేయపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట కొత్తపేట నియోజకవర్గ ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలోని స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ఎంపీడీవో రామన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యమని ఎంపీడీవో అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్లను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. అనంతరం గ్రామస్తులు పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య నిర్మూల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బోనం సాయిబాబా ఎంపీటీసీ, మండల, గ్రామ స్థాయి అధికారులు, కూటమి నాయకులు, ర్యాలీ జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'జంగిల్ బుక్' ఓపెన్ స్కూల్ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో శనివారం ఉదయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (ఐఎస్‌టి) ఎదురుగా నవీకరించిన (రెనోవేషన్) 'జంగిల్ బుక్' ఓపెన్ స్కూల్‌ను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ప్రారంభించారు. యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరుకాగా అతిథులుగా రెక్టార్ ప్రొ కెవి రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ నవీకరించిన ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రతీ ఒక్కరు ఇష్టపడతారన్నారు. అధ్యాపకులు ఏడాదిలో నాలుగైదు తరగతులు తీసుకుంటే బోధనలో ఉన్న సంతృప్తి వర్ణించలేనిదన్నారు. ఈ ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులు పాఠ్యాంశాలపై స్వేచ్ఛగా చర్చలు జరుపుకోవచ్చునన్నారు. శాంతినికేతన్ మాదిరిగానే ఇక్కడ కూడా విద్యార్థులు సరదాగా తరగతులకు హాజరుకావచ్చునన్నారు. ఓపెన్ స్కూల్ నవీకరణకు కృషి చేసిన చీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, డిఇఇ సన్నీ ఫ్రాన్సిస్, ఏఇఇ బి నవీన్ మరియు ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆయన అభినందించారు. రెక్టార్ ప్రొ కెవి రమణ మాట్లాడుతూ నవీకరించిన ఓపెన్ స్కూల్‌ను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఓపెన్ స్కూల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా కాలుష్యరహితమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు తరగతులకు హాజరయ్యేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ కాన్సెప్ట్ చాలా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ప్రొ జి ఏసురత్నం, ప్రొ ఏఎం ప్రసాద్, ప్రొ ఏ స్వర్ణకుమారి, ప్రొ ఏఎస్ఎన్ చక్రవర్తి, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ ఎం స్వరూపారాణి, ప్రొ జివిఎస్ఆర్ దీక్షితులు, మాజీ ఉపకులపతులు ప్రొ జివిఆర్ ప్రసాదరాజు, ప్రొ కె పద్మరాజు, విభాగాధిపతులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు పనిచేద్దాం

విశాలాంధ్ర - ఆలమూరు : తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఆలమూరు మండలంలోని 18 గ్రామాల్లో శనివారం కూటమి నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆయా గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

విశాలాంధ్ర - కాకినాడ : పారిశుధ్య నిర్వహణ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సిబ్బందికి సూచించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున ఉదయం కాకినాడ నగరంలోని తొమ్మిదో సర్కిల్, అలాగే పెద్ద మార్కెట్ ప్రాంతంలో కమిషనర్ భావన పర్యటించారు. చెత్త సేకరణ, వాహనాల్లో తరలింపు వంటి విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్'

విశాలాంధ్ర - గండేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం గండేపల్లి ఎస్సై శివ నాగబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ చుట్టూ ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంనందు మండల ప్రత్యేక అధికారి ఎంవి రామారావు, ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ ఆద్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమమును ప్రారంభించారు. ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ గెడ్డం సుధ రాజు పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారి యంవి రామారావు మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ బికెఎస్ఎస్ వెంకట రామన్ తెలియజేశారు. ఆత్రేయపురం మండలములో 17 గ్రామాలలో గల అన్ని శాఖల సిబ్బంది మరియు గ్రామాలలో గల నాయకులతో కలిసి వారిచే పంచాయితీ కార్యదర్శి ముందుగా ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కార్యక్రమములో పరిపాలనాధికారి, వి రామ స్వారూప్, మంత్రిత్వ సిబ్బంది, ఆత్రేయపురం గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యూజిక్ ఫెస్టివల్ రాయల్ బూమ్ బాక్స్

రాజమండ్రి: సమకాలీన హిప్ హాప్ బీట్స్‌తో బాలీవుడ్‌లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన తమ మూడవ ఎడిషన్ కోసం సీగ్రామ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. ఈ సీజన్ ను మిర్చి తయారు చేస్తుండటంతో, ఈ శీనమయ్యే మ్యూజిక్ ఫెస్టివల్ తాజాగా జరిగిన ప్రత్యేక మీడియా ప్రివ్యూలో రాబోతున్న శ్రేణిని ప్రదర్శించింది. ఈ విలక్షణమైన సాంస్కృతిక కలయిక సంప్రదాయ బద్ధమైన, ఆధునిక భారతదేశపు సంగీతం యొక్క కూడలిని పునర్నిర్వచించడం కొనసాగించింది, బ్రాండ్ యొక్క 'లివింగ్ ఇట్ లార్జ్ లీ' సిద్ధాంతానికి చిహ్నంగా నిలిచింది. వినియోగదారులు పాల్గొనడానికి కీలకమైన మూలస్తంభంగా బ్రాండ్ కోసం మ్యూజిక్ నిలిచింది. రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ బాలీవుడ్ శాశ్వతమైన శ్రావ్య గీతాలను హిప్-హాప్ ఉత్సాహంతో ఎంతో ధైర్యంగా కలిపింది. నేటి తరం, జనరేషన్ లార్జ్ యొక్క ఒరిజినల్ సౌండ్‌ను తయారు చేసింది. ఫెస్టివల్ యొక్క విలక్షణమైన రూపం ట్రెండ్స్ ను అనుసరించడానికి బదులు ట్రెండ్ ను సృష్టించే నేటి యువతకు అనుగుణంగా ఉండే విలక్షణమైన సౌండ్ ను తయారు చేసింది.

యుగ పురుషుడు ఎన్టీఆర్

విశాలాంధ్ర -కొవ్వూరు : సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీని ప్రారంభించి, 9 నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టి, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు అన్న నందమూరి తారక రామారావు అనే కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం కొవ్వూరు పట్టణంలోని బస్టాండ్ సెంటర్, ఆరవ వార్డు, విజయ విహార్ సెంటర్ నందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు పండ్లను రొట్టెను పంపిణీ చేశారు వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సీనియర్ నాయకులు సూర్యదేవర రంజిత్ కుమార్, కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షులు దయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, కాగిత రఘు, కెవికె రంగారావు, కొప్పాక విజయనంద జవహర్, కొక్కిరపాటి వెంకటేష్, బర్ల శ్రీనివాస్, వరిగేటి కాంతరాజు, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ : చినరాజప్ప

విశాలాంధ్ర - సామర్లకోట : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలను సామర్లకోట మఠం సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అడబాలకుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పేద ప్రజల కోసం పనిచేయాలని ఉద్దేశంతో పార్టీని స్థాపించి ముఖ్యమంత్రిగా అద్భుతమైన పరిపాలన సాగించిన వ్యక్తి ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. రాజకీయ అనుభవం లేకపోయినా అనేక నిర్ణయాలు తీసుకుని మున్సిబు, కర్ణాల వ్యవస్థ రద్దు, రెండు రూపాయలకే కిలో బియ్యం, మాండలిక వ్యవస్థ వంటి చట్టాలను అమలుపరిచారని, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీరు సౌకర్యం, వైద్య సౌకర్యాలను కల్పించడం జరిగిందని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం బియ్యం అందజేసిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, ముందు చూపుతోటి అనేక సంస్కరణలను తీసుకొచ్చి రాష్ట్రంలో మంచి బాటలు వేశారని, అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఎన్నికల్లో చంద్రబాబు ఏదైతే హామీలు ఇచ్చారో ఆహామీలన్నీ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, అలాగే పెద్దాపురం నియోజకవర్గంలో ఏదైతే హామీలు ఇచ్చారో ఆ హామీలను అమలు చేయడానికి శ్రీకారం చుట్టడం జరిగిందని చినరాజప్ప అన్నారు. అంతకుముందు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీష్ మోహన్, పైని శ్రీనివాసరావు, గొల్తి సత్యనారాయణ, తాతపూడి కృష్ణబాబు, కాళ్ల రవీంద్ర, కాపవరపు కుమార్ పడాల వీరబాబు, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్టీఆర్

విశాలాంధ్ర - ఏలేశ్వరం : తెలుగు జాతి ఉన్నంతవరకు డాక్టర్ నటరత్న ఎన్టి రామారావు పేరు మారు మోగుతూనే ఉంటుందని, తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్టీఆర్ అని ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఈ మేరకు ఆయన ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు జాతికి స్ఫూర్తిదాయకం ఎన్టీఆర్

విశాలాంధ్ర - కడియం : తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహానుభావుడు దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు జాతికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కడియం ఎంపిపి వెలుగుబంటి వెంకట ప్రసాద్, రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణలు పేర్కొన్నారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో కడియం దేవి చౌక్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్తిపాటి రామారావు చౌదరి, చిలుకూరి ప్రభాకర్, వరగోగుల వెంకటేశ్వరరావు, జల్లి కృపారావు, వనుం సూరిబాబు, అనసూరి గోవిందరాజు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు స్ఫూర్తి ఎన్టీఆర్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగు ప్రజలకు స్ఫూర్తి ప్రధాత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకే దక్కిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), తెదేపా జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, సీనియర్ నాయకులు చిక్కాల రామచంద్రరావు, పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి, పేరాబత్తుల రాజశేఖర్ తదితరులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం, జిల్లా పరిషత్ సెంటర్ నందు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాంతినగర్లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ నందు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద బసవతారకం, రామారావు బస్ షెల్టర్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్, వనమాడి కొండబాబులు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అన్న ఎన్టీఆర్ మాటలు నేటికి ఆచరణీయమని, మరణం లేని మహా పురుషుడన్నారు. తెలుగు చరిత్ర ఉన్నంతకాలం ఎన్టీఆర్ గుర్తుంటాడని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, సుంకర పావని తిరుమల కుమార్, సులుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఎన్టీఆర్

విశాలాంధ్ర - జగ్గంపేట : తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను శనివారం స్థానిక నియోజకవర్గ టిడిపి కార్యాలయంలోను, ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా ఆయన పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక సెంటర్‌లోని ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలలలోనే అధికారంలోకి వచ్చిన మహా నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ముసలి వారికి, భర్త చనిపోయిన మహిళలకు పింఛన్ పథకాన్ని అన్న నందమూరి తీసుకువచ్చారన్నారు. మహిళలకు ఆస్తిలో హక్కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ వంటి అనేక సంస్కరణలు తీసుకు వచ్చింది ఎన్టీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్. రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌వివిఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఆడబాల భాస్కరరావు, పోతుల మోహనరావు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఎన్టీఆర్

విశాలాంధ్ర - కాకినాడ : తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తెలుగు కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీ యుడు మన అన్న నందమూరి తారక రామా రావు అని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ డాక్టర్ చొప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కరప గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదుపరి జిల్లా కలెక్టర్ షన్మోహన్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంపింగ్ యార్డ్, స్మశాన వాటిక సమస్యలను కలెక్టర్ దృష్టికి జనసేన నాయకులు భోగి రెడ్డి గంగాధర్, మండల అధ్యక్షులు దేవి వెంకన్న, బిజెపి నాయకులు దుర్గారావు వారితో కలిసి తీసుకు వెళ్లడం జరిగింది. కార్యక్రమంలో కరప సర్పంచ్ సాదె ఆశాజ్యోతి, ఎండివో అనుపమ, శానిటరీ సిబ్బంది, జగ్గరావు మండల టీడీపీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి స్థానికులు పాల్గొన్నారు. దకుదురు గ్రామ సర్పంచ్ దేగల లలిత కుమారి, చంద్రశేఖర్ అలయన్స్ గవర్నర్ వనమి శ్రీనివాసరావు జయేంద్ర బాబు గొల్లపల్లి శేఖర్ కోతల గోవిందు పబినీడి సూరిబాబు గ్రామ కార్యదర్శి వారిజ, పైనీ నాగసత్య పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా నడకుదురు జనావళి వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర కొవ్వూరు : గ్రామాలు పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంని పొందగలమని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన గ్రామాలు మన పట్టణాలు బహిరంగ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచాలని లక్ష్యంతో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం కొవ్వూరు పట్టణంలోని బస్టాండ్ నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మున్సిపల్ కార్మికులతో కలిసి బస్టాండ్ ఆవరణమును పరిశుభ్రంగా చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. మన ఇంటి పరిసరాలతో పాటు గ్రామ పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యత కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ వై వివిఎన్ కుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనే స్ఫూర్తి : మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అనే నినాదంతో తెలుగుదేశం పార్టీను స్థాపించి రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చి, తెలుగువాడి కీర్తిని, గౌరవాన్ని ప్రపంచానికి సాటి చెప్పిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ నందమూరి తారక రామారావు ఆశయ సాధనలో నేటితరం ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకొని రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పేదల పెన్నిధిగా, అందరి అన్నగా స్వర్గీయ ఎన్టీఆర్ తీసుకొచ్చిన సంస్కరణలు చిరస్మరణీయమని అన్నారు. పేదలకు కిలో 2 రూపాయలకే బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన గొప్ప నేత ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.4 వేలు పింఛన్, మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు పింఛన్ ఇస్తూ వారిని దత్త పుత్రులుగా ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. ఐదేళ్ల వైసీపీపాలనతో రాష్ట్రం తిరోగమన దిశగా వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించి ముందుకు సాగిపోతున్నామన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్ఫూర్తిని భవిష్యత్తులో కుడా కొన సాగిస్తూ, రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సుభాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం కూటమి నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే దేవ

విశాలాంధ్ర - రాజోలు : అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శనివారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి రాంబాబు అధ్యక్షతన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడానికి ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ రోజుగా నిర్వహించాలని చెప్పారు. తొలుత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాలమూరు శ్యాంబాబు, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - రాజానగరం : గృహాలు శుభ్రతతో పాటుగా తమ పరిసరాలు సైతం పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపిడివో) జెవి.ఝాన్సి రాణి అన్నారు. మండల కేంద్రమైన రాజనగరంలో పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడివో ఝాన్సి రాణి మాట్లాడుతూ ప్రతిఒక్కరు వారి పరిసరాల పరిశుభ్రత కొరకు ప్రతి రోజు కొంత సమయం కేటాయించాలని కోరారు. అదేవిధంగా గ్రామాలు శుభ్రపరచడంలో సహాయం చేయ్యాలని తోటి వారికి అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎన్.ప్రసాద్,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీహరి నాయుడు

విశాలాంధ్ర - కాకినాడ : కాపునాడు రాష్ట్ర నూతన కమిటీ నియామకంలో కాకినాడ పార్లమెంట్‌కు చెందిన నక్క శ్రీహరి నాయుడును కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ కాపునాడు జాతీయ అధ్యక్షులు గాళ్ళ సుబ్రహ్మణ్యం నియామకపు ఉత్తర్వులను శ్రీహరి నాయుడికి అందజేశారు. గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు కాపులు పెద్దన్న పాత్ర పోషించి కాకినాడ పార్లమెంట్ మొత్తం తన కార్యవర్గం ప్రసారం నిర్వహించి కూటమి అభ్యర్థుల విజయానికి తన వంతు సహకారం అందించినందుకు శ్రీహరి నాయుడు సేవలను గుర్తించి జాతీయ అధ్యక్షులు చేశారని శ్రీహరి నాయుడు తెలియజేశారు. తనకు సహకరించి తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను తనపై ఉంచిన జాతీయ అధ్యక్షులు సుబ్రమణ్యంకి అలాగే కాపు నాయకులకు, పెద్దలకు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మహనీయుడు ఎన్టీఆర్ : బొడ్డు

విశాలాంధ్ర - రాజానగరం : తెలుగుదేశం పార్టీ స్థాపించి తెలుగువారి ఖ్యాతిని నల్ల దిశల వ్యాపింపజేసిన మహనీయులు ఎన్టీఆర్ అని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా తెలుగు తమ్ముళ్ళ నేతృత్వంలో వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సూర్యారావు పేట లోని ఎన్టీఆర్ విగ్రహానికి రుడా ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు.అలాగే చిన్నారులకు పలువురు విద్యార్ధులకు పుస్తకాలు,పెన్ను అందజేశారు. ఈ.అనంతరం రాజానగరం లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలువురు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి(మల్లిబాబు),మాజీ ఎంపీపీ బచ్చు ప్రసాద్, మాజీ జడ్పీటీసీ కొల్లం రత్నం, మండల నాయకులు బుడ్డిగా అప్పారావు,నూనె వెంకన్న,నీలపాల అరవ రాజు, టీఎన్టియుసీ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస రావు,చిట్టిప్రోళ్ల పద్దారాజు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు ఎన్టీఆర్

విశాలాంధ్ర-దేవరపల్లి: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రినందమూరి తారక రామారావు అని పలువురు టిడిపి నేతలు పేర్కొన్నారు. దేవరపల్లిలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, గన్నమని హరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రాంబాబులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి అతి తక్కువ కాలంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి, ముఖ్యమంత్రి పదవి చేపట్టి రాష్ట్ర ప్రజలకు సేవలు అందించారన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఎన్టీ రామారావు రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ ఉక్కు సంకల్పం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు గన్న మనిహరికృష్ణ, యాగంటి వెంకటేశ్వరావు, ఉప్పులూరి రామారావు, కే భీమరాజు, కొండపల్లి దొరయ్య, విజయకుమార్ రాజు, నందిన శ్రీధర్, పెన్నమనే నవీన్, ముళ్ళపూడిసత్యనారాయణ, గద్దె యశ్వంత్, జ్యేష్ఠ హరీష్ చౌదరి గద్దె కృష్ణారావు తదితరులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు గద్దె సుబ్రమణ్యం సీనియర్ తెలుగుదేశం నాయకులు సుంకర దుర్గారావు యాగంటి సాయిబాబు ఒరిగంటి లక్ష్మీపతి రాజు యాగంటి సుబ్రహ్మణ్యం తంగేళ్ళ మునేశ్వర రావు కరుటూరి శ్రీనివాస్ యాగంటి శ్రీనివాస్ కే బాలాజీ తదితరులు పాల్గొన్నారు మండలంలో పల్లంట్ల, కురుకూరు, తజంపూడి, ఎర్నగూడెం, చిన్నాయ గూడెం, యాదవులు లక్ష్మీపురం, దుద్దుకూరు , గౌరీపట్నం, బంధపురం, రాజావారి గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని ఆయన శిలా విగ్రహానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు.

హెల్మెట్లు ధరించి.. ప్రాణాలు కాపాడుకోండి

విశాలాంధ్ర- కొవ్వూరు : రోడ్డు ప్రమాదాలలో తలకు గాయాలయ్యి ఉన్నారని ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం వలన ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుకోగలమని 9వ అదనపు జిల్లా జడ్జ్ ఎం అనురాధ అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని జిల్లా కోర్టునందు ది కొవ్వూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జ్ ఎం అనురాధ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో వాహనదారులు తగిన జాగ్రత్తలను పాటించాలని, వాహనములను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి సాయికృష్ణ, రెండవ అదనపు మెజిస్ట్రేట్ కే నాగలక్ష్మి, ది కొవ్వూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యాగంటి చలపతిరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వి ఎల్ ప్రవీణ, జిల్లా కోర్టు పిపి కోమటి గోపాలకృష్ణ , తొర్లపాటి రబిందర్ తదితర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆపదలో ఉన్న వారిని జనసేన పార్టీ ఆదుకుంటుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ డి సువర్ణ రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో శనివారంఇటీవల మృతి చెందిన జనసేన నాయకుడు అని శెట్టి నాగ దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు బీమా చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ అని శెట్టి నాగ దుర్గాప్రసాద్ జనసేన పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే వాడిని పార్టీ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నప్పుడు ప్రమాదంలో మృతి చెందాడని అన్నారు. అని శెట్టి దుర్గా నాగ ప్రసాద్ మూర్తి వలన పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన నాగ దుర్గాప్రసాద్ కుటుంబానికి జనసేన పార్టీ ఇన్సూరెన్స్ చేయించిందని, ఆయన మరణంతో పార్టీ ద్వారా ఐదు లక్షల రూపాయలు చెక్కు రావటం జరిగింది అన్నారు. రూ.5 లక్షల చెక్కును ఆయన భార్యకు అందజేశామని సువర్ణ రాజు తెలిపారు. తమ పార్టీ అధినేత ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తిగా తీసుకొని ఆపదలో ఉన్న వారిని తక్షణం ఆదుకుంటున్నామని సువర్ణ రాజు వెల్లడించారు. జనసేన పార్టీ నాయకులు గ్రామ జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు కంబాల సత్తిబాబు, జనసేన పార్టీ నేతలు మాధవరపు వెంకటేశ్వ రరావు, జాజిమొగ్గల శ్రీనివాస్, సూరిశెట్టి బాలు, కొడమం చిలి శ్రీనివాస్, కొడమంచిలి రమేష్, దాసరి శేషారావు, కాజా మొహిద్ది. ఆకుల వీర్రాజు, వీర మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్య పరిరక్షణ

విశాలాంధ్ర - సామర్లకోట : పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం తదితర లక్ష్యాలతో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. శనివారం సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో మఠం సెంటర్ వద్ద మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ గ్రామాలు పట్టణాలు బాగుపడాలి, శుభ్రంగా ఉండాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. సామర్లకోట మండలం పి వేమవరం

గ్రామంలో ట్రైని కలెక్టర్ భావనతో కలిసి స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, శానిటరీ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిని పెద్దాపురం ఆర్డీఓ కె శ్రీరమణి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఆక్సిజెన్ ప్లాంట్, వార్డులు, లాబ్, మాతా శిశు సంరక్షణ విభాగం, ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను పరిశీలించారు. పేషెంట్లకు వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ ఎం సూర్యప్రభ, సీహెచ్సీ సూపరిటెండెంట్ డాక్టర్ బి సౌమ్యమైఖేల్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎ గోపాలకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆసుపత్రిలో పరిసరాలు పరిశుభ్రత పై స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

విశాలాంధ్ర - కాకినాడ : పోలీసు నియామక పక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన పురుషలు, స్త్రీ అభ్యర్థులకు, కాకినాడ జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ దేహదారుఢ్య సామర్థ్య పరీక్షలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపియస్, వీజీఎ భాస్కర రావు, అదనపు ఎస్పీ పరిపాలన, శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ AR, ఇతర పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. శనివారంతో కాకినాడ జిల్లా నందు పోలీస్ కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియ ముగిసినది.

పారిశ్రామిక వృద్ధిరేటు సాధనకు కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: ఏలూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతిలో 20 శాతం వృద్ధి రేటు సాధించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదని, జిల్లా యంత్రాంగం అందించే సహాయ సహకారాలతో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం ప్రగతిశీల, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలు, ప్రభృతులతో నిర్వహించిన 'పారిశ్రామిక సమ్మిట్-2025' కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నదని, ఇందుకోసం అనేక విభాగాలలో నూతన పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నదన్నారు. పారిశ్రామిక ప్రగతిలో మన జిల్లా ప్రాథమిక దశలోనే ఉన్నదని, ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ప్రోత్సాహకాలతో జిల్లాలో ప్రస్తుతం ఉన్న పరిశ్రమల సంఖ్యకు 200 శాతానికి పైగా పెంచేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యంగా , వ్యవసాయం, అనుబంధ రంగాలైన ఉద్యానవనాలు, ఆక్వా ఉత్పత్తులకు వేల్యూ అడిషన్ తో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఎంతో అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువతకు అనుమతులు, రుణాలు, శిక్షణ,సాంకేతిక సహకారం వంటివి అందిస్తామన్నారు. యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు.ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు వారికి సహకరించాలన్నారు..జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. విజయరాజు మాట్లాడుతూ జిల్లాలో 100 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాలో ఇప్పటికే మహిళా సంఘాలతో తృణధాన్యాలతో కుక్కీస్, బిస్కట్ల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిదంగా హోమ్ మేడ్ చాకోలెట్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతికి ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా పారిశ్రామికాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో డ్వాక్రా రుణాల ద్వారా యూనిట్లు స్థాపించి పలువురికి ఉద్యోగకల్పన అందిస్తున్న మహిళలను కలెక్టర్ సన్మానించారు. జాబ్ మేళా లో ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు,, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఎల్డిఎమ్ నీలాద్రి, ఉద్యానవనాలు శాఖ డిప్యూటీ డిరైక్టర్ రామ్మోహన్, పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ మారుతీ పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్'

విశాలాంధ్ర ప్రతినిధి ఏలూరు: ఏలూరు నగరంలో శనివారం ఉత్సాహపూరిత వాతావరణంలో 'స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివాస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ,జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ,ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) , స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థలు. మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీపురు చేతపట్టి బస్టాండ్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. తదుపరి అధికారులు, ప్రజలు, విద్యార్థులు, మహిళలతో కలిసి మానవహారంగా ఏర్పడి వారందరితో స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె . వెట్రి సెల్వి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివాస్' నిర్వహించడం జరిగిందన్నారు. దీంతో పరిశుభ్రమైన వాతావరణం, ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం జరుగుతోందన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ ఏలూరు నగరంలో ఉద్యమంలా సాగి స్వచ్ఛహేలాపురిగా నిలిపేందుకు ప్రతిఒక్కరు భాగస్వామ్య కావాలన్నారు. ప్రస్తుత పరిశుభ్రత చేస్తున్న ప్రాంతాలు తిరిగి అపరిశుభ్రం కాకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.ఏలూరు కాలువను పక్షాళన చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పోరేటర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు,నగరపాలక కమీషనరు ఎ. భానుప్రతాప్, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు,డిఇఓ వెంకటలక్ష్మమ్మ, డిపివో కె.అనురాధ,జిల్లా పౌరసరఫాల సంస్థ మేనేజరు వి. శ్రీలక్ష్మి, డిఎస్ఓ ఆర్ఎస్ఎస్ రాజు,జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.ముక్కంటి, తహసీల్దారు శేషగిరి, జిల్లా బిసి సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, ఆర్ టిసి డిఎం డి. వాణి,మానవతా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి

విశాలాంధ్ర - రాజానగరం : మండలం లోని శ్రీరామపురం గ్రామంలో వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న దార శ్రీరామ చంద్రమూర్తి(47) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందారు. దీనికి సంబందించి వీఆర్వో యూనియన్ జిల్లా అధ్యక్షులు సాన శ్రీను విశాలాంధ్రతో శనివారం మాట్లాడుతూ దార శ్రీరామ చంద్రమూర్తి రాజానగరం మండలంలోని దివాన్ చెరువు పరిధిలోని శ్రీరామపురం వీఆర్వోగా పనిచేస్తున్నారు.పండుగ సమయంలో బ్రైన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఓ ప్రైవేట్ హాస్పిటల్ చేర్పించారన్నారు. దీంతో చికిత్స పొందుతూ చంద్రమూర్తి ఈ నెల 17న తుదిశ్వాస విడిచినట్లు చెప్పారు. తహసీల్దార్ జిఎల్ సత్యవతి దేవి చంద్రమూర్తి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగడా సానుభూతిని వ్యక్తం చేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ రూ.25 వేలు వారి కుటుంబానికి అందిచినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఆర్ఐ రంభ, రిసర్వే డిటి బి.శాంత కుమారి, వీఆర్వో యూనియన్ డివిజన్ అధ్యక్షులు ఎ. శ్రీనివాస్, వీఆర్వోలు కె.నాగేశ్వరావు, ఆర్.నాగేశ్వరావు, వై. ఎ.రాజ శేఖర్, ఎం.పోసిబాబు హాజరై వీఆర్వో కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలో వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి రాణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కుటుంబాన్ని పరామర్శించి రూ.5000 వేలు ఆర్థిక సహాయం అందజేసిన ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణం రాజు, అలాగే మురుకుర్తి అప్పన్న అదే రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబాన్ని మురళి రాజు పరామర్శించి జరిగిన ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు రూ.5000 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మురళి రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో కష్టాలు ఉన్న నిరుపేదలను ట్రస్ట్ తరఫున ఆదుకుంటామని మురళీకృష్ణం రాజు అన్నారు. ఆయన వెంట గ్రామ వైసీపీనాయకులు బర్ల గోవింద్, అవ్వ ఆదినారాయణ, కోలా తాతబాబు, కోన బాబ్జి, గింజాల సత్తిబాబు, గొర్ల రమణ, కిల్లాడ శివ, సింహాద్రి, రాజా పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు నైపుణ్యంతో కూడిన ఉద్యోగవకాశాలు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని, వీటిని యువత సద్వినియోగం చేసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలియజేశారు. శనివారం కలెక్టరు ఛాంబర్ లో ' పీఎం ఇంటర్న్‌షిప్ పథకం' గోడ ప్రతులను జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిదర్ రామన్, సహాయ సంచాలకులు ప్రదీప్ కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎమ్. పెరుమాళ్ల రావులతో కలిసి కలెక్టరు ఆవిష్కరించారు. కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించినట్లు తెలియ చేశారు. 20 కంటే ఎక్కువ రంగాలలో యువతకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా అవకాశాలు ఉన్నాయన్నారు. పీఎం ఇంటర్న్‌షిప్ చేయాలనుకునే వారికి దేశవ్యాప్తంగా అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్హతలను అనుసరించి పీఎం ఇంటర్న్‌షిప్ పథకం అర్హత సాధించడానికి, దరఖాస్తుదారులు తమ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలి. ITI నుండి సర్టిఫికేట్, పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్ నుండి డిప్లొమా లేదా BA, BSc, BCom, BCA, BBA, BPharm, B.Tech వంటి డిగ్రీని కలిగి ఉండాలి. ఆన్లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రామ్లలో నమోదు చేసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. యువత ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోండన్నారు. మరిన్ని వివరాల కొరకు 9948995678, 7396740041 నంబర్లను సంప్రదించగలరు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం కిమ్స్ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో పురోహిత్ క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు పాల్గొన్నారు.రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన మ్యాచులు విజయవాడ, అన్నవరం తలపడగా అన్నవరం విజేతగా నిలిచింది. కాకినాడ రుద్రాసు, రాజమండ్రి తలపడగా కాకినాడ రుద్రాస్ విజేతగా నిలిచింది. కాకినాడ 2 శరవనభవ నర్సీపట్నం పోటీ పడగా నర్సీపట్నం నెగ్గింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ.అధికారి జయవేంకట లక్ష్మి, ఉపద్రష్ట నాగార్జున, ఆదిత్య పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SIVA RENUKAMANI BANDARU, Wife of Bandaru Srinivasa Prasad,** H.No. 4-184/1, Main road,Near ITI College, 4th Ward, Velamapeta, VTC, Pentapadu Village, Pentapadu Mandal, W.G.District (A.P)-534166. **Aadhar Card No. 3258 9100 6479.** I hereby declare that I have changed my name **BANDARU SIVA RENUKA (Old name) to SIVA RENUKAMANI BANDARU (New Name)** by virtue of my marriage with my husband. Hence this name change affidavit.

వాడ వాడలా ఎన్టీఆర్ వర్ధంతి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : పేద వర్గాలను అన్నివిధాలా ఆదుకున్న మహనీయులు ఎన్టీఆర్ ఒక్కరేనని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కొని యాడారు. ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తూ టీడీపీ పార్టీ ఎన్నో ట్రస్టుల ద్వారా ఎంతోమందికి చేయూతనిందిస్తోందని చెప్పారు. ఏలూరు అమీనా పేటలోని జిల్లా టీడీపీ పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో పాటు పలు పురు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించగా దాదాపు 50 మంది నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకట రత్నం, పార్టీ నాయకులు ఎబిఎస్ శర్మ, పూజారి నిరంజన్, మారం అను, దాకారపు రాజేశ్వరరావు, బెజ్జం అచ్చాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతిని మండలంలో రాజవరం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుదగాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సీనియర్ నాయకులు వాడపల్లి రాధా కృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేద ప్రజల కష్టాలను చూసి టీడీపీ పార్టీని స్థాపించారని, అటువంటి మహా మనిషిని ముందు ఎన్నడు చూడలేమని తెలిపారు. కార్యక్రమంలో గర్సికుటి శ్రీనివాసరావు, గరికపాటి సత్యనారాయణ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు అనంతల శ్రీను, కోన రాజకుమార్, బచ్చు బాబురావు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టి నరసాపురం: మండలంలో మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లం, బందంచర్ల, బొర్రంపాలెం, 100 రామన్న పాలెం, మక్కినవారిగూడెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తోటలక్ష్మీనారాయణ, ఆచంట సూర్యనారాయణ, భీమవరపు జగన్మోహనరావు, బండి శ్రీనివాసరావు, జయ్యవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు చక్రదేవరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ సాయిల సత్యనారాయణ, టీడీపీ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి దుర్గా రామ్ ప్రసాద్‌లు తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ అధ్యక్షుడు సాయిల సత్య నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి దుర్గా రామ్ ప్రసాద్‌లు మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ బడుగు బలహీనవర్గాలకు, మైనార్టీలకు, ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి, విద్యా, ఉద్యోగ, రాజకీయ, ప్రారిశ్రామికరంగాల్లో అభివృద్ధి చెందేలా పేదప్రజలను ఆదుకొన్న మహానుభావుడు అని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు అనిశెట్టి శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షులు కుక్కల సూరిబాబు, తలారి వీరబాబు షేక్ పెంటా సాహెబ్, గోపే నాగేశ్వరావు, గో పే శ్యామ్ తేజ్ ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమా నులు సచివాల యం సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకోడేరు : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నట రత్న నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని పురస్కరించుకుని పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాలలో టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. మోగల్లు గ్రామంలో సర్పంచ్ మల్లిపూడి కృష్ణవేణి నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మకుటం లేని మహారాజుగా ఎదిగి అనంతరం ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో 1982లో పార్టీ స్థాపించి పార్టీ స్థాపించిన 9 నెలలోనే అధికారాన్ని చేజిక్కించుకొని తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని దేశ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు అని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు సాంబ్రాణి సత్య శ్రీ సంకరుడు, సీనియర్ నాయకులు డాక్టర్ భీమరాజు, తెలుగు యువత మండల అధ్యక్షుడు వసుం వెంకటేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలిదిండి : విశ్వవిఖ్యాత నట సార్వభౌమ టీడీపీ పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతిని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని మట్టగుంట గ్రామంలో నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా కూటమి నాయకులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. రాజకీయాలలో కొత్త నిర్వచనం తీసుకు వచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్అని అన్నారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించి ఎందరో బీసీ నేతలను రాజకీయంగా ఉన్నత స్థానంలో నిలిపారని అన్నారు. అనంతరం వృద్ధులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. డీసీ వైస్ చైర్మన్ నాగిడి. వీరబ్రహ్మం, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బళ్లా. రాజు, అండ్రాజు దుర్గారావు, తిరుమాని. పాండురంగా రావు, నల్లమోతు వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య సంరక్షణలో చిరు వ్యాపారులే వైద్యులు

డిస్పోజబుల్ గ్లాసులు, క్యారీ బ్యాగులు, పేపర్ ప్లేట్స్ ఫిబ్రవరి 1 నుండి నిషేధం.

విశాలాంధ్ర - పెంటపాడు : చిరు వ్యాపారులు లాభసాటి వ్యాపారంతో ఆరోగ్యవంత మైన ఆహారాన్ని అందించేం దుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం పెంటపాడు గ్రామంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పర్యటిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించడం జరిగిందని, 12 నెలల పాటు ప్రతినెల మూడో శనివారం పరిసరాలు పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, కల్తీ లేని ఆహార పదార్థాలు తదితర అంశాలపై కార్యక్రమాలను చేపట్టడం జరు గుతుందని తెలిపారు. పరిశుభ్రతపై ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపా డవలసిన సామాజిక బాధ్యత మీపై ఉందని నిరంతరం గుర్తుంచుకోవాలని కోరారు. నిల్వపెట్టిన పదార్థాలను, మాంసాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మ రాదని సూచించారు. ఫిబ్రవరి 1 నుండి తనిఖీలు ఉంటాయని తనిఖీలలో ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చ రించారు. గిట్టుబాటు కాకపోతే ధరలను పెంచి ఆహార పదార్థాలు అమ్మ కాలు చేపట్టడానికి నావంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రఘు, తహసీల్దార్ వై.శ్రీనివాస్, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ఛాయాచిత్రాలతో

ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- ఉంగుటూరు : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఛాయా చిత్రాల ముద్రించిన 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ధర్మరాజు ఆవిష్కరించారు. శనివారం ఉంగుటూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజమండ్రి జన సేన పార్టీకి బార్లపూడి (ముద్రగడ) క్రాంతి రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యేకి అందజేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు కూటమి నాయకుల సమక్షంలో క్యాలెండర్లను ఆవిష్కరించి, ఆమెను అభినందించారు.

నాగరాజును మాజీ ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం ఎంపీటీసీ సభ్యులు, ఉంగుటూరు మండల ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజును మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసు శనివారం పరామర్శి ంచారు. నాగరాజు తండ్రి కన్నయ్య ఇటీవల మృతి చెందటం పాఠకులకు తెలిసింది. కన్నయ్య చిత్రపటానికి వాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పరామర్శించారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం

విశాలాంధ్ర- భీమడోలు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, శుభ్రత పాటించడం ద్వారా స్వచ్ఛ భీమడోలు సాధనకు కృషి చేసినట్లు అని భీమడోలు ఎంపీడీఓ పద్మావతి దేవి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ నేతృత్వంలో పంచాయతీ ఆవరణను అదేవిధంగా స్థానిక హైస్కూల్ సమీపంలో రోడ్లను పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు శ్రమదానం చేసారు. చీపుర్లు పట్టి రహదారులను శుభ్రం చేసారు. స్థానిక హైస్కూల్ రోడ్డులో పరిసరాలను పరిశుభ్రం చేసి మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేసారు. ఎంపీడీవో పద్మావతిదేవి మాట్లాడుతూ కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. మండల సచివాలయ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ధర్మరాజుకు సచ్చిదానంద స్వామీజీని ఆశీర్వచనాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామంలో ఉన్న శ్రీ బాల సుబ్రహ్మణ్య దత్త క్షేత్రము నందు అవధూత దత్త పీఠాధి పతి పరమ పూజ్య జగద్గురు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదా నంద స్వామీజీని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు కలిసి శనివారం వారి ఆశీర్వచనలు తీసుకున్నారు. నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, పలువురు కలుసుకున్నారు.

ఆధ్యాత్మిక, పౌరాణిక నాట్య ప్రదర్శనలు

విశాలాంధ్ర-ఉండి : మండల పరిధిలో కోలమూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ సంతాన గోపాల స్వామి ఆలయం సమీపంలోని మెయిన్ రోడ్డు ఆంధ్ర బ్యాంకు పక్కన ఈనెల 20వ తేదీ నుండి నాలుగు రోజులపాటు ఆధ్యాత్మిక పౌరాణిక నాట్య ప్రదర్శనలు సురభి)హైదరాబాదు వారిచే రంగస్థలనాట్య ప్రదర్శనలు నిర్వహించబడునని ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నంబూరి బదరి నారాయణరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఇందు ధర్మ ప్రచార పరిషత్ వారి సౌజన్యంతో నిర్వహించబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు ,మాజీ శాసనమండలి సభ్యులు మంతెన వెంకటనారాయణ రాజు,హాజరవుతున్నట్లు తెలిపారు. గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక, పౌరాణిక, కార్యక్రమాలను ప్రజలందరూ పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులను అభినందించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర - రాజోలు : 1ఎం1బి జాతీయ యువ మార్పు తయారీ దారుల రాష్ట్రపతి సదస్సుకు ఎంపి కైన విద్యార్థులకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. గత నెల 24న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన యువ మార్పు తయారీ దారుల సదస్సుకు ఆంధ్ర ప్రదేశ్ నుండి డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామం లోని వివేకానంద స్కూల్ 9వ తరగతి విద్యార్థినిలు పెసల భువన సాధిక, నల్లి రోజిలిన్‌ల ప్రాజెక్ట్ రాష్ట్ర పతి భవన్‌లో రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము సమక్షంలో ప్రదర్శించారు. కుప్పంలోని ద్రవిడియన్ యూని వర్సిటీలో 1ఎం1బి సంస్థ, ఏపి ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన 1ఎం1బిగ్రీన్ స్కిల్స్ అకాడమీ సెంటర్ ప్రారంభించడానికి విచ్చేసిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రాజెక్ట్ వివరాలను విద్యార్థులు స్వయంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న 1ఎం1బి సంస్థను, స్కూల్ ప్రిన్సి పాల్‌ను చంద్రబాబు నాయుడు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో యు వతి యువకులలో నైపుణ్యాలను అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరా భివృద్ధి లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని 1ఎం1బి ఫౌండేషన్ వ్యవస్థా కులు మానవ్ సుబోధ్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ఎంపిక కార్యక్రమంలో జాతీయ స్థాయిలో9 ప్రాజెక్టులతో 15 మంది విద్యార్థులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఎంపికైన ఏకైక పాఠశాల వివేకానంద అని అన్నారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ్ సుబోధ్‌తో పాటు ప్రాజెక్ట్ డైరెక్టర్ అభిరామ్, టీం ఇంచార్జ్ దీపిక, డిస్ట్రిక్ మేనేజర్ కె సాగర్ పాల్గొన్నారు.

వేమన పద్యాలు నేటి సమాజానికి నీతి చంద్రికలు

విశాలాంధ్ర - కడియం : వేమన పద్యాలు నేటి సమాజానికి చాలా అవసర మని చెల్లపిళ్ల వెంకటశాస్త్రి కళా సేవా సమితి గౌరవ అధ్యక్షులు తోరాటి వసంతరావు అన్నారు. కళా సేవా సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వేమన జయంతోత్సవాలు ఘనంగా జరిగాయి. వేమగిరి బుద్ధ విహార్ అధ్యక్షులు యార్లగడ్డ మైత్రి నెలకొల్పిన భారీ వేమన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. తోరాటి మాట్లాడుతూ విపరీతమైన మూఢనమ్మకాలు పెరిగిపో తున్న నేటి తరా నికి వేమన పద్యాలు ఎంతో అవసరమన్నారు. వేమన పద్యాలు అందరికీ అర్థ మయ్యే రీతిలో సరళమైన భాషలో ఉన్నాయన్నారు. నేర ప్రవృత్తి పెరిగిపో తున్న నేటి తరానికి వేమన పద్యాలే అసలు సిసలైన నీతిచంద్రికలు అన్నారు. యార్లగడ్డ మైత్రేయ 700 సంవత్సరాల కిందటి వేమన జీవిత చరిత్రను చక్కగా వివరించారు. వేమన శతక పద్యాల పుస్తకాలను పలువురికి బహూక రించారు. యుటిఎఫ్ నాయకులు ఆకుల వీర్రాజు చెల్లపిళ్ల కమిటీ సభ్యులు తమ్మిశెట్టి ప్రసాద్, డి నీలకంఠ రావు, ఆకుల సూర్యనారాయణ, బి రామకృష్ణ, జి తాతబ్బాయి, కెసుబ్రహ్మణ్యం, సర్వేశ్వర లక్ష్మణరావు ఎస్ సత్యనారాయణ, ప్రముఖ రచయితలు డిఆర్ఇంద్ర శ్రీరంగం విశ్వనాథ్ ప్రభృతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ మనందరి బాధ్యత

విశాలాంధ్ర - సీతానగరం: స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ మనందరి బాధ్యత అని ఎంపిడిఓ ఎమ్ భారతి అన్నారు. శనివారం మండలంలో గల ఇనుగంటివారిపేట గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంపిడిఓ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిసరాల పరిశుభ్రత, మనం నివసించే, తిరిగే ప్రాంతాలలో శానిటేషన్ కార్యక్రమాల రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం సూచనల మేరకు ప్రతి నెలా ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ్ దివస్‌గా పాటించాలని అన్నారు. అలాగే మిశ్రమ వ్యర్థాలు కలిగిన చెత్త నుండి ఆ ప్రదేశంలో తడి పొడి చెత్తను వేరు ఆదాయ వనరుగా అభివృద్ధి కోసం అడుగులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విశాల్, పాండు, కంప్యూటర్ అసిస్టెంట్ జగదీష్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి

విశాలాంధ్ర - గండేపల్లి : టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని యువ నాయకులు మురారి గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్ టీడీపీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వ హించారు. స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జాస్తి వసంత్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నటునిగా, ప్రజానాయకునిగా, కోట్ల మంది ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. గద్దె అబ్బన్న, మురారి గ్రామ టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పిఠాపురం : మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బంగారమ్మ తల్లి రావి చెట్టు సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం దగ్గర ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఒక కలం పోటుతో మద్య పానాన్ని నిషేధించిన ఎన్టీఆర్‌కి జోహార్లు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎన్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ కలలుగన్న మద్య రహిత సమాజ స్థాపనకి ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. దశల వారీగా మద్యాన్ని నిషేధించాల్సింది పోయి, రోజు రోజుకి మధ్యాహ్నం ఒక ఆదాయ వనరుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు కరణం విశ్వనాథం, భాస్కర ఆచార్యులు, వనపర్తి సూర్యనారా యణ, ఎస్ఎఫ్ఐ సిద్ధు, మిరియాల చంటి, వరద వీరభద్రరావు పాల్గొన్నారు.

సీతానగరం: తెలుగు ప్రజల గుండె చప్పుడు నందమూరి తారక రామారావు గారు అని రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు టీడీపీ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సిఎం ఎన్ టి ఆర్ 29వ వర్ధంతి వేడుకలు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రఘుదేవపురం ఎన్ టి ఆర్ సెంటర్లో గల ఎన్ టి ఆర్ విగ్రహం వద్ద బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాండ్రు శ్రీనివాసరావు, చుండ్రు సత్య ప్రసాద్, వలవల రాజా, కాండ్రు శేఖర్, గద్దే శివ,కూచిపూడి కేశవరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యన్నవయ పంటలపై దృష్టిసారించాలి

విశాలాంధ్ర - రాజానగరం : ప్రత్యా న్నయ పంటలపై రైతులు దృష్టిసారించాలి తద్వారా అధిక దిగుబడులు సొంతం చేసుకోవా లని తూర్పు గోదావరి జిల్లా వ్యవ సాయ శాఖాధికారి ఎస్.మాధవ రావు అన్నారు. మండలంలోని సీతారాంపురం గ్రామంలో మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్ కె.ఇమామి ఖాసిం ఆధ్వర్యంలో పోషక ఆహార భద్రత పథకం పై పొగాకు రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు సాధ్యమైనంత వరకు పొగాకు సాగు తగ్గించి పంట మార్పుడు చేసుకోవాలని కోరారు. ఖర్చు తక్కువైనా అపరాలు,మొక్కజొన్న పంటలు సాగు చేయాలని తద్వారా అధిక ఆదాయం అర్జించేందుకు బాటలు వెయ్యాలని పిలుపునిచ్చారు. ఏడిఏ డి.శ్రీనివాస్ రెడ్డి,మండల వ్యవసాయ శాఖాధికారి ఎస్ కె.ఇమామి ఖాసిం మాట్లాడుతూ పంట మార్పిడి ద్వారా పంటలను పట్టిపీడి స్తున్న చీడపీడలు,తెగుళ్ళు ఉధృతి తగ్గ ముఖం పట్టి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. విఏఏలు సుబ్బలక్ష్మి ధర్మరాజు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వార్షిక ధృవీకరణ ప్రమాణపత్రం అందజేయాలి : సత్యనారాయణ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన పింఛనుదార్లు వారి కుటుంబ పింఛనుదార్లు ప్రతి సంవత్సరం సమర్పించ వలసిన తమ తమ లైఫ్ సర్టిఫికెట్ (వార్షిక ధృవీకరణ ప్రమాణపత్రం) ను జనవరి 1, 2025 నుండి ఫిబ్ర వరి 28, 2025 లోపు మాత్రమే విధిగా సమర్పించ వలెనని తూ.గో.జిల్లా ఖజానా అధికారి ఎన్. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ ద్వారా సదరు లైఫ్ సర్టిఫికేట్ నిర్ధారణ చేయ వచ్చు అని డిటివో సత్యనారాయణ పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికేట్ ను జీవన్ ప్రమాణ ద్వారా ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించే అందుబాటులో ఉందని, ఆధార్‌సంఖ్య ఆధారంగా బయో మెట్రిక్ గుర్తింపు రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటిపితో కూడి లైఫ్ సర్టిఫికేట్ అందజేయాలల్సి ఉంటు ందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్స్ జనవరి 1 నుంచి ఫిబ్ర వరి 28 తేదీ వరకు మాత్రమే ఆన్లైన్ ద్వారా సిఎఫ్ఎమ్ఎస్ లో పెన్షన్ సొంత లాగిన్ ద్వారాలేదా "ఎన్ఐసి-జీవన్ ప్రమాణ్"ద్వారాలోసబ్మిట్ చేయాలన్నారు.

భక్త జనసంద్రంగా వాడపల్లి దివ్య క్షేత్రం

విశాలాంధ్ర-ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వ రస్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పిం చారు. ఉదయం వేకువ జామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహి ంచి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. శనివారం స్వామివారి ఆదాయం రూ.34,58,129లు సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృ తిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు, సూపరింటెండ్ పి రాంబాబు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐఐ ఎస్ రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానవత్వం చాటుకున్న సర్పంచ్

విశాలాంధ్ర-కడియం : కడియం మండలం కడియపులంక గ్రామా నికి చెందిన ఉండ్రజు వరపు ప్రసన్న, పట్నా రాజేష్ అనే యువ కులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, రాజమండ్రి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నర్సరీలో పనులు చేసుకుంటూ రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులకు మెరుగైన వైద్యం చేయించుకోవడం మరింత కష్టంగా మారడ ంతో స్థానికులు ద్వారా ప్రమాద విషయాన్ని తెలుసుకున్న కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ యువకుల యోగక్షేమాలు తెలుసుకొని ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ రాంజీ చేసిన ఆర్థిక సహాయానికి క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కట్టాశివ, అంజి, జట్ల శ్రీను, బొచ్చే సందీప్ పాల్గొన్నారు.

నక్కా కాశి సోదరులకు సత్కారం

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం కడియపులంక ముసలమ్మ తల్లి ఆలయానికి టేకు రథాన్ని బహూక రించిన నక్కా కాశి సోదరులను వైకాపా రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్ర రావు ఘనంగా సత్కరించారు. శని వారం ఆయన కడియపులంక శ్రీ విశ్వేశ్వర హైటెక్ నర్సరీకి వెళ్లి నక్క కాశి విశ్వేశ్వరరావు, అమ్మిరాజు సోదరులను అభినందించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో దేవాల యాల అభివృద్ధికి, గ్రామాభివృద్ధి ఎప్పుడు ముందుండే నక్క రామ్మూర్తి కుమా రులు ఆదర్శనీయులన్నారు. గట్టి వీరబాబు, గాధంశెట్టి రాంబాబు, ఆరేటి వెంకటరావు, పుల్లేపు శ్రీనివాస్, మెల్లిమి భాస్కర రావు తదితరులు ఉన్నారు.

జేగురుపాడులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్

విశాలాంధ్ర-కడియం : కడియం మండలం, జేగురుపాడు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లాలోనే అగ్రగామిగాఉన్నదని గ్రామ సర్పంచ్ వై సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. జేగురుపాడు గ్రామ పంచా యతీ స్వంతంగా డంపింగ్ యార్డు కలిగి ఉందని, ప్రజలనుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం, రోడ్లను డ్రైన్లను శుభ్రపరచడం నిరంతరం జరుగుతూనే ఉంటుందనితెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా దళితపేట ఇందిరానగర్‌లో, గ్రామ పంచా యతీ సిబ్బంది మరియు కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాస్‌లు ఇంటింటికి తడి చెత్త పొడి చెత్త వేరుచేసి ఇచ్చుటకు డస్ట్ బిన్‌లు అందజేశారు. సర్పంచ్ స్టాలిన్, కార్యదర్శి శ్రీనివాసులు పారిశుధ్య ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి ప్రజలను చైతన్య పరిచారు.

23న అమర్ రాజా కంపెనీలో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : ప్రభుత్వ ఐ టి ఐ రాజమహేంద్రవరం (కలెక్టరేట్ వెనుక) నందు ఈ నెల 23 న అమర్ రాజా కంపెనీ లో ఉద్యోగ నియామక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు, ఈ ఉద్యోగాలకు ఐ.టి.ఐ లో సివిల్ ట్రేడ్ వారు మినహా మిగిలిన అన్ని ట్రేడ్‌ల యందు ఉత్తీర్ణత మరియు అప్రెంటి షిప్ సర్టిఫికెట్ కలిగిన వారు అర్హులని, ఉద్యోగమునకు ఎంపిక అయిన అభ్యర్థులకు జీతంతో కలిపి పిఎఫ్,ఇఎస్ఐ,గ్రాట్యుటీ, ఇతరములు అందజేస్తా రని, సబ్సిడీతో కూడిన భోజన మరియు హాస్టల్ వసతి సదుపాయాలు కల్పించబడునని తెలియజేశారు.